డిలో యీకొనస్యకలతాళ్లు అనేతాటితోపును చూచి, బహుసంతోషపడి, వాటి పొడుగుకున్ను లావుకున్ను చేవకున్ను చక్కదనమునకున్ను ఆశ్చర్యపడి, ఆహా, యిటువంటి తాటిమానులు మన దొరగారి కోసరము బ్రహ్మసృష్టించినాడో? లేక, నేపాళమునుంచి విత్తులు తెచ్చి యీ వూరి కాపులు చెట్లువేశి పెంచినారో? తెలియదని, బహు సంతోషపడి, దొరగారితో మరి యెక్కడా బంగాళా కట్టతగిన మానులు లేవు; ఫలాని వూళ్లో నూరు బంగాళాలయినా కట్టతగినమానులు బహులెస్సగా వున్నవని చెప్పిరి.

3. ఆ దొరగారు గుర్రపునవారిచేసుకొని, యింత జనముతో అక్కడికివచ్చి చూచిరి. అప్పుడు అది పల్లెటూరు అయినందున, అనామికుడయిన కొత్త మనిషి వచ్చినప్పటికిన్ని, బలాత్కారముగానైనా అడిగి తెలుసుకొని, ఒకరితో ఒకరు చెప్పుకొనే వాడుక కలదు; గనుక, యిప్పుడు యెన్నడు దొరలను కండ్లతో చూచి యెరుగని, పలపట్రజనులందరున్ను యీ దొరగారు అక్కడికి వచ్చిన సంగతి విని, కంచి గరుడశేవలో వరదరాజుల దర్శనమునకు వచ్చి చేరినట్టు గుంపు చేరి, ఆశ్చర్యపడి చూచిరి.

అప్పుడు ఆ దొరగారు యీ మానులు నరికించే తాత్పర్యము యెవరికిన్ని చెప్పక మునుపే ఆ జనులు మిక్కిలి పశుప్రాయులయినప్పటికిన్ని, యీ మానులు నరికించేటందుకు వచ్చినారని అందరున్ను యేకరీతిగా వూహించుకొని, నిశ్చయపరచుకొని, ఆ గ్రామములో పెద్దరెడ్డి కరణము మొదలయిన వారితో యీ అన్యాయము యెన్నడు విని కనియెరుగము; ఇప్పుడు యీ గ్రామములో వుండేవారు యెవ్వరున్ను దివాణములో అధికారస్థులుగా లేరు; అంతా పిల్లపెత్తనమై పోయినది; జాతులవాండ్లు మన దేవరమానులు నరికితే ఒకరయినా వద్దని చెప్పేవారు లేరు; యికమీద యీ మానుల రుచి గన్నవెనక, దొరలకు యిటువంటిమానులు దొరకవు గనుక, ఒకరుని చూచి ఒకరు దొరలు తమ మనుష్యులను పంపించి, తలా పచేశి మానులు తమ తమబంగాళాలకు నరికించబోతున్నారు; అటువెనక, యీ వూరున్ను పాడుబడిపోనో యేమో అని, ఆడవాండ్లు పిల్లకాయలు దిగులుపడి, గుంపులుగూడి మొరబెట్టిరి.

4. ఆ మాటలు కాపు కరణాలు విని, తమకు యీ కన్యకల వల్ల వచ్చే వుపద్రవము కంటె యీ గ్రామస్థులవల్ల అధిక వుపద్రవము కలుగుతున్నది; వీండ్లు యితడు పెద్దరెడ్డితనమునకు పనికిరాడనిన్ని, యితడు కరణీకమునకు పనికిరాడనిన్ని, యీ పెత్తనము పసలపోలిగాడికి యిస్తే యీ సమయములో వాడు కూడా దొరలకు అర్జీ యిచ్చి, యీ దేసరమానులు నరకకుండా వుత్తరవు తెచ్చు నని, కర్ణశూలములైన మాటలు చెప్పుతున్నారు లింగ పోటు కంటె దొంగ పోటే మేలు అని, చెప్పినట్లు, దొరవల్ల యేమితొందర వచ్చినా చక్కపరుచుకోవచ్చును; యీ పామరుల వల్ల వచ్చే రవ్వపడ శక్యముగాదని, యీ కాపు కరణాలు గుంపు కూడుకొని, ఆదొరగారి దగ్గిరికి పోయి, అక్కడ సందడి చేసేవారిని వెట్టివాండ్లచేత, తలారివాండ్లచేత, మొహతాదులచేత వెళ్లగొట్టించి వినయపూర్వకముగా దండముబెట్టి, మహాప్రభో! తమరు ధర్మప్రభువులు; మేము మీ ఆజ్ఞకు లోబడి వుండవలసిన వారము; మాకు యే ఆపద వచ్చినా కడతేర్చగలందులకు మా పాలిటి దేవుడు తమ్మున యేర్పరచి వుండగా; తమరే యిటువంటి అన్యాయము

జరిగిస్తే, మాకు యిక యెవరుదిక్కు అని, ఆ దొర తో చెప్పిరి. అప్పుడు ఆదొరగారు ఈ కాపుకరణా లను చూచి, తమకు తెనుగు రానందువల్లనున్ను, వారికి యింగ్లీషు తెలియనందువల్లనున్ను, తాను చెప్పే మాటలు దుబాసి తనము చేసి చెప్పడమున కు గుఱ్ఱపువాణ్ణి తత్కాలమునకు దుబాసిగా యేర్పరచుకొనిరి.

5. అంతట, ఆ కాపుకరణాలు మిక్కిలి వినయ ముతో ఆ గుఱ్ఱపువాడి ముఖము చూస్తూ వుండగా, ఆ దొరగారు వీరు యేమి చెప్పుతారో వినుమని వానికి వుత్తరవు చేసిరి. అప్పుడు వారు ఈ గ్రామములో బహు కాలమునుంచి దైవికరాజికము లవల్ల యేచేటునున్ను పొందక యీ నాటితోపు యిన్నాళ్లు దనుకా వృద్ధిబొందినది. నేటికి మా గ్రా మము నిర్మూలమై పొయ్యేటట్టుగా, తమరు నరికించ డము మా తలలు నరికించడము కంటె యెక్కువ దుఃఖకరముగా వున్నదని, చేతులు కాళ్లు గడగడ వణుకుతూ వుండగా, డగ్గుత్తికపడగా, కండ్లలో నీళ్లు కమ్ముతూవుండగా, గుండె లదురుతూ వుండగా, ఒళ్లు జలపరిస్తూ వుండగా, తడబడుతూ, నడమనడమ

గుండె దిటవు చేసుకొని, ఆ కాపుకరణాలుచెప్పిన మాటలను ఆ దుబాశీ గుండా దొరగారు తెలుసుకొని, మీకుయెవరు చెప్పినారు? యీ మానులు మేము నరకవలెనని మీకేమైనావుత్తరవు చేస్తిమా? యింకా యెవరైనా చెప్పినారా? అని అడుగుమనెను.

6. అందుకు వారు అయితే తమరు యెందుకు వస్తిరి అని అడిగిరి. అప్పుడు ఆ దొరగారు అబద్ధము చెప్పే స్వభావము కలవారు కారు గనక, ఈమానులు మీకేమయినా సంసారమునకు కూడదల చేస్తున్నవా? వీటిని నరికించి యీ భూమి బయిలు చేసి పుట్టా చెట్లు కొట్టించి పైరు పెట్టించితే, సర్కారుకు లాభము వున్నది; మీకున్ను మేడిపాలు కలిసి వస్తున్నది. యిందువల్ల మీకే సౌఖ్యము; మీరు యెందుకు సమాధాన పడరని అడిగెను. అందుకు అయ్యా, యీ తోపులో దేవతలు ఈ గ్రామమునకు రక్షకులుగా వున్నారు; గనక, అందులో మానులు నరికితే, మా గ్రామమునకు బహు కీడు కలగపోతున్నది. యిదిగాక, నరికే వాండ్లు నోటా ముక్కునా నెత్తురుకక్కి చత్తురు.

యిది నరికించినందువల్ల తమకున్ను యేమైనా తొం దర కలుగును, గనక మా మనవి చిత్తగించి, తమకు యింకా గ్రామములో యేమి యిష్టమో అది అడిగితే యిస్తున్నాము. మీరాయందు దయచేసి, ఈ పని మానుకోవలసినదని మనివి చేసిరి.

7. అటువెనక ఆ దొరగారు నెల్లూరికి పోయి, కలక్టరు గారితో కలుసుకొని, యీ చోద్యపు సమా చారము విందు వేళలో ప్రస్తావమునకు తెచ్చి, తాటి చెట్లు దేవతలట! వాటిని నరికితే నోటా ముక్కునా నెత్తురు కక్కుకొని చస్తారట! ఆ గ్రామమునకే కీడ ట! నరికించినవారికి కూడా వుపద్రవము వచ్చునట! యిటువంటి వింతలు యే దేశములోనైనా యే కా లమందైనా వింటిమా? కంటిమా? అని, దొరలు దొరసానులు పకపక నవ్వగా చెప్పి అటువెనక, ఆ తాటిచెట్లయొక్క చక్కదనమునున్ను వర్ణించి, ఆ వూరివారితో యీ తాటితోపు నరికినందువల్ల వారికిన్ని సర్కారువారికిన్ని కూడా కలిగే లాభ మునున్ను, తాము చెప్పిన సంగతిన్ని, వారు తమ తో మాట్లాడేటప్పుడు ఆగాత్యముచేసిన సంగతిన్ని యీ దొరగారు సవిస్తారముగా చెప్పిరి.

8. తర్వాత ఆ విందుకు వచ్చిన దొరలందరున్ను యోచనచేసి, అవశ్యముగా వీరి అజ్ఞానమును సరికి నట్టుగా ఆతాటితోపును నరికించవలసినదని నిశ్చయించిరి. ఇంతలో ఆ గ్రామస్థులున్ను మేజస్ట్రీటు దొరగారికి ఆ మానులు నరికించవద్దని మహాజరునామా చేసి ఒక అర్జీయిచ్చి, కలక్టరుదొరగారి యెదట మొరపెట్టుకోనడమునకు కూడా యత్నపడి వుండిరి. అప్పుడు అక్కడ వుండే కొందరు దొరల మనసు గుర్తెరిగిన వారు, యిది యుక్తముకాదని వారికి తెలియచెప్పిరి.

9. అటువెనక ఒకవారం దినములు తాళి కొందరు మనుష్యులు కూడా రాగా, తహశ్శీలుదారుడు దొరల వుత్తరపు ప్రకారము ఆ వూరికిపోయి, ఆ మానులు నరికించడమునకు మనిషి 1 కి ఒక వరహా కూలి యిస్తామని చెప్పి బలాత్కారముగా పిలిపించినప్పటికిన్ని, ఆగ్రామములో మాత్రమే కాకుండా, పొరుగూళ్లయందు కూడా, చస్తామనే భయము చేత నరకడమునకు కూలి మనిషి దొరకక పోయెను. పిమ్మట ఆ తహశ్శీలుదారుడు దొరలకు యీ సంగతి తెలియచేసెను.

10. తరువాత ఆ దొరగారు కొందరు దండులో వుండే తురక ప్యాదాలను పిలుచుకొనిపోయి, తమరు స్వంతముగా యెదట నిలిచి నరుకుమనగా, ఆ గ్రామస్థులు కుయ్యో మొర్రో యని కూస్తూ వుండగా, యిద్దరు మనుష్యులు గొడ్డండ్లు తీసుకొని, ఒక మాని మొదట పుట్టచెట్టు కొట్టి చదరపరిచి, రెండు వేట్లు వేసిరి. ఆ మాను బహుదినములనుంచి పెరిగి లెస్సగా చేవ ముదిరి వుక్కు స్తంభము వలె గొడ్డలికి తిరగబడెను. అప్పుడు ఆ దొరగారు మాటిమాటికి నరికేవారికి వుత్సాహము జానెడు హెచ్చేటట్టు చెప్పితే, ఆ గ్రామస్థులు మూరెడువుత్సాహము దిగేటట్టు బెదురుపెడుతూ వచ్చిరి. వోరి ముండాకొడుకుల్లారా! యీదొర యిచ్చేకూలి మీకు బ్రతికితే కదా అనుభవమునకు వచ్చును. ఆ మాను పడేటప్పటికి మీరున్ను పడుతున్నారు. యీ బహుజనవాక్యము వ్యర్థమైపోదు,అని ఘోషిస్తూ వుండగా; కొంతసేపటికి ఆ యిద్దరు మనుష్యులు తమ శక్తి కొద్ది నరికి, కింద ఆమానును పడదోసేటప్పటికి ఒక ధ్వని కలిగెను.

11. ఆ ధ్వని బహు పొడుగైన ఆ తాటి మాను కిందపడే ధ్వనో; లేక, ఆ జనులపాలిటి దేవుడి ధ్వనో, తెలియదు. ఆ ధ్వని వినగానే ఆ నరికిన మనుష్యులు యిద్దరున్ను భూమిమీదపడి, ఒకడు చచ్చెను; ఒకడు మూర్ఛబోయెను. అంతట, ఆ చచ్చినవాడి కుటుంబమునకు వారు బ్రతికేదాకా జీవనము అయ్యేటట్టు, ఆ దొరగారు భరణము యేర్పరచి, ఆ మాను విడిచిపెట్టి పోయిరి.

12. అటువెనక ఆ మాను సుమారు యిక్కడి మూడు లెంకాయమానులపొడుగు కలిగినది. అది అడ్డముగా పడివుండడము చేతను అక్కడతత్పూర్వం వుండిన కాలి దోవ ఆ మానును చుట్టుకొని యేర్పడినది. యెందువల్లనంటే, ఆ దేవరమాను దాటితే మనుష్యులకు కండ్లు చెడిపోతున్నవని ఒకరిని చూచి ఒకరు భయపడి, చుట్టిపోతూ వచ్చిరి. ఆ మాను భూమి మీద పుట్టలున్ను చెట్లున్ను బలిసి, మూసుకొని పోయి, అడ్డముగా ఒక చెరువు కట్టవలె అగుపడుతున్నది.

→ హాలీంఖాన్ మోసపోయిన కథ. ←

1. విక్రమ (A. D. 1760.) సంవత్సరమందు శిద్ధవటంలో వున్న సరవరఖానుణ్ని కడపకు రమ్మనుమని, నవాబు మోసుంఖాన్ వర్తమానము అంపించగా, కడపకు రావడానకు అనుమానించి, సరవరఖానుడు రాకపోయినందున, నవాబు మోసుంఖాన్ సరవరఖానుని పట్టితెప్పించవలెనని, యోచనచేసినంతట ; ఆ సంగతి సరవరఖానునికి తెలిసి, కొంతమందితోటి సిద్ధవటం బైలువెళ్లి,కంభంతట్టుకు లేచిపోయెను.అక్కడ కొంతమందిని కూడ కూర్చుకొని, ఒకసారి సిద్ధవటం పేటమీదవచ్చి, దుర్మార్గము చేసినంతట, సిద్ధవటం కోటలోవున్నవారు కార్యపెట్టిరి. [కార్యపెట్టుట అనగా యుద్ధముచేసుట.] గనుక, వారితో కొంత సేపు కార్యంచేసి, సరవరఖానుడు తిరిగీ పోయెను. తరువాత, విషు (A. D. 1761.) సంవత్సరమందు సిద్ధవటం కోటలో వున్న నాయకులు తిమ్మినాయడు, సిద్ధినాయడు, శిక్కువాండ్లు మొదలయిన ముఖ్యసరదార్లు యేకస్థులై, కుట్రచేసి, సిద్ధవటం కోటలో సంకెళ్లతో వున్న అబ్దుల్‌హాలీమఖానుణ్ని సింహా

సనముమీాద కూర్చుండబెట్టి,నజరులు గుజరాయించి నారు.

2. ఆ వర్తమానము కడపలో నవాబు మోసుం ఖానుకిని తెలిసి, ఆ విషయమందు తాను విరోధిం చినట్లయితే, కార్యము భంగములోకి వస్తున్నదని యోచనచేసి, తాను కడప విడిచి కందనోలుకు లేచి పోయెను ; గనుక, సిద్ధవటం కడప రెండున్ను హాలీం ఖానుడు రాజరికముచేస్తూవుండి,తనతమ్ములైన సైదు మియ్యాఖాన్ రమ్జామియ్యాఖాన్ అనే వారికి పసు పుల వుయ్యాలవాడవగైరా కొన్నిగ్రామములు స్వా ధీనము చేసినందున, వారు వుభయులు కొంత ఫౌజు తో కూడా పోయి, పసుపుల వద్ద దిగి వుండగా.

3. సరవరఖానుడు నూరు గుర్రములు యిన్నూరు దండుతోటివచ్చి ఆ వుభయుల మీాద కార్యపెట్టగా, కొంతసేపు యుద్ధము అయినతరువాత,సరవరఖానుడు తిరిగి పోతూవుండగా, సైదుమియ్యాఖాన్, రమ్జుమి య్యాఖాన్ వుభయులు వెనకదగిలిపోయి,వుయ్యాల వాడ దగ్గిర సరవరఖానుణ్ని తలగొట్టినారు.

4. నవాబు మోసుంఖానుడు కందనోలుకు పోయినతర్వాత, తనముద్ర వుంగరము గయాసాహేబు అనే తనమనిషి చేతికి యిచ్చి హాలీంఖానునికి యిమ్మని అంపించగా, అతను ముద్ర వుంగరము తీసుకొని వస్తూ వున్నంతట, హాలీంఖానుడు, గయాసాహేబు యేమి నిమిత్తముచేత వస్తున్నాడో అని, సిద్దిహిలాలు అనే సరదారుణ్ని తగినమాత్రం సైన్యముతో అంపించినంతట, అతను గయాసాహేబుకు యెదట పోయి గుండు చలాయించినాడు. అంతట, గయాసాహేబు నవాబు హాలీంఖానుని వారికి నవాబు మోసుంఖానునివారివద్దినుంచి మొహరు తీసుకొని వచ్చినాను; నా మీద కార్యముచేయవలసిన అగత్యము లేదని అగుపరచగా, సమాధానమై వుభయులు కడపకు వచ్చి, మొహరు హాలీంఖానునికి గయాసాహేబు యిచ్చినాడు.

5. అంతట, నవాబు మోసుంఖాన్ కందనోలులో కాలమై పోయినాడు. యీ హాలీంఖానుడు శాలివాహన శకం 1183 విషు సంవత్సరం లగాయతి కడప సుబా సిద్ధవటం సహా రాజ్యము చేస్తూవుండగా విరోధిసంవత్సరమందు బహాదరు వురఫ్ హైద

దు అల్లీఖాన్ శ్రీరంగపట్ణము ప్రభుత్వము చేస్తూ వున్నవాడు ఫౌజుతో కూడావచ్చి, సిద్ధవటానకు దక్షిణముగా వున్న వంటిమిట్ట నద్దికి వచ్చి దిగి వుండి, నవాబు హాలీంఖానునిమీాదను తిరగబడడానకు యోచించి యుండిన యెడల, నవాబు హాలీంఖానుడు తన వద్ద దివానుగిరి చేస్తూవున్న కార్యస్థుడు వుత్తమచందులాలాను రాయభారమునకు పంపించి, పేష్కషు నిర్ణయము యిచ్చేలాగున చేసుకొని, కొంత పైకమున్ను యిచ్చినందున, బహదరు పైకము తీసుకొని వెళ్లి పోయెను.

6. అప్పుడు బహాదరుకు యిచ్చే పైకము నిమిత్తముగాను వుత్తమచందులాలా మారీఫత్తున కొంత జాగీరు యిచ్చి వుండగా, ఆ జాగీరు వుత్తమచందు తన వద్ద కొంత తాను అపహరించి వుంచుకొన్నాడని, రాజాహూపరాము 1 వుయ్యాలవాడ కేశవరెడ్డి 1 వీరు వుభయులు నవాబు హాలీంఖానునితో చెప్పినందున, నవాబు ఆ మాటలు విశ్వసించి, వుత్తమచందులాలా యిల్లు లుటాయించి, అతణ్ని యేనుగ కాలికికట్టి చంపించినాడు.

7. తర్వాత,మన్మథసంవత్సరమందు నవాబు నిజామల్లీఖాను తట్టునుంచి కొంతసైన్యముతో కూడా నిజామద్దౌంసా అనే నరదాసుడువచ్చి, హారిహారం తట్టున దిగి వుండగా, నవాబు హాలీంఖానుడు పోయి నిజామద్దౌంసాను కలుసుకొని, బహాదరుమీాదను తిరగబడవలెనని యోచనచేసి వుండగా, బహాదరు శ్రీరంగపట్టణము విడిచి బైలుదేరి, బళ్లారితట్టున వచ్చి వుండగా, నిజామద్దౌంసా తిరిగి నిర్మల అనే గ్రామంమార్గాన పోతూ, కడప హాలీంఖానుని స్థళానకు లేచి పొమ్మని చెప్పినంతట.

౮. హాలీమఖానుడు తుంగభద్రకు వుత్తరము గొనుపల్లెకు పోయి, అక్కడ కండనవోలు నవాబు మునవరఖానుడు వుండగా రెండు రోజులు వుండి అక్కడినుంచి సైన్యముతో కూడా దువ్వూరి తాలూకు చాకర్ల పాళెమునకువచ్చి కోట చిట్టివేలి సమూస్థానికులైన మట్ల అప్పయ్యరాజు వారి పరముగా వుండగా ఆకిల్లాకు ముట్టడి వేసి నాలుగు నెలలు యుద్ధము చేసి కిల్లా జయించి అక్కడినుంచి సిద్ధవటంలోకి ప్రవేశించి.

9. తర్వాతను బహాదరు యెక్కడ వున్నాడు. యేమిగా వున్నాడు. తెలియుగలందులకు వేగుల వాండ్లను అంపిస్తూ వచ్చినంతట, పోయి వచ్చినవా రిలో కొందరు బహాదరు దైవగతిని పొందినాడని చెప్పుతూరాగా ఆప్రకారము చెప్పుతూవచ్చిన వారికి హాలీముఖానుడు యినాములు యిస్తూ వచ్చినాడు. యీ వర్తమానము బహాదరుకు తెలిసి మీారుసా హేబు అనేవానితో కూడా కొంతఫౌజు తైనాతిచేసి కడపతాణా వెయ్యమని పంపించగా అతడు వచ్చి దువ్వూరి తాలూకాకు సామీాప్యము కుమ్మద్ది యనే గ్రామముయొక్క కిల్లా తీసుకొన్నంతట.

10. ఈవర్తమానము హాలీమఖానునికి తెలిసి తన తమ్ముడైన గఫూమియ్యా మరివొక తమ్ముడైన సైదు మియ్యా కొమారుడు హుసేనుమియ్యానున్ను యీ యిద్దరి వెంబడి కొంత సైన్యము జంగీ సామానున్ను సిద్ధిహీలాలు అనే సరదారున్నిన్ని కూడా యిచ్చి కడప బందోబస్తు చేసుకొని వుండమని పంపించినం తట వారు కడపకు వచ్చి మీారుసాహేబు అనేవాడు బహాదరుతట్టునుంచి కుమ్మద్ది కిల్లా గ్రామం తీసుకొ

న్నాడు గనుక దువ్వూరికి పోయి ఆకిల్లా బందోబస్తు చేసి కిల్లాకు వెలుపట దిగి వుండగా.

11. బహాదరు కోట్టునుంచి వచ్చిన మీరుసాహేబు కుమ్మదినుంచి బైలుదేరి జంబులమడక తీసుకొని అక్కడినుంచి వచ్చి పొద్దుటూరు తీసుకొన్నంతట దువ్వూరివద్ద వున్న హాలుసేనుమియ్యా వగైరాలు పోయి పొద్దుటూరిమీదను లడాయి చేసి మీరుసాహేబు ఠాణా విడిపించి తిరుగావచ్చి దువ్వూరివద్ద దిగి వుండిరి. అంతట వెనకనుంచి యింకా కొంతఫౌజు కుమ్మకు చేస్తేనేగాని తననుంచి కడప ఠాణా వెయ్యడము నిర్వాహకపడదని మీరుసాహేబు బహాదరు చిత్రకల్లు తట్టున వుండగా వర్తమానము అంపించుకొన్నంతట.

12. ఆవర్తమానము వింటూనే బహాదరు టీపూ చిత్రగల్లుతట్టునుంచి యావత్తైన్యముతో వచ్చి దువ్వూరికి నైఋతి భాగమందు కుందుగడ్డను ఖాసా డేరా వేయించుకొని జిల్లేళ్ల, తంగటూరు, వెల్వలి, చిలమకూరు, యీనాలుగు అయిదు గ్రామములు మోళీ ఫౌజు యావత్తు దిగివుండెను. బహాదరు టీపు

చిత్రగల్లు నుంచి సైన్యము యావత్తు తీసుకొని వస్తారు అని హాలీముఖానునికి వర్తమానము తెలిసి, హుసేనుమియ్యా గపూమియ్యా శిద్దిహిలాలుసహా యీయిద్దరిని వారితో వున్నసైన్యము సహా వచ్చి కడపలో ప్రవేశించి వుండమని వుత్తరములు వ్రాయించి పంపిస్తే సిద్దిహిలాలు అనే సరదారుడు ఫితూరి చేసి బహదరు క్షేమము కోరినవాడై హాలీముఃఖానుడు పంపించిన వుత్తరములు హుసేనుమియ్యా వారికి అగుపరచక తనవద్దనే దాచిపెట్టుకొని వుండెను.

13. శాలివాహనశక సం. ౧౭౦౧ వికారిసంవత్సరము చైత్ర శు ౧౫ పౌర్ణమినాడు రాత్రి భోజనములు అయినపిమ్మట హుసేనుమియ్యా గపూమియ్యా యావత్తైన్యముతో సిద్దిహిలాలుః అనే సరదారుణ్ని కూడా వెంటబెట్టుకొని యెదట వచ్చివున్న ఫౌజుమీరు సాహేబుదిగాని బహదరు టీపు వచ్చివున్నారని వర్తమానము తెలియక వున్నందున మీరు సాహేబును మనము యెదిరించలేక పోతామా అనే పౌరుషముచేత నవాబులు యిద్దరున్ను యేనుగులమీద యెక్కి సిద్దిహిలాలు అనే సరదారుణ్ని

వెంబడి తీసుకొని బహాదరు ఫౌజుకు యెదురుగా మైదానమునకు వచ్చి నిలిచి చూడగా యేమూలను యెంత లెక్క చూచినా ఫౌజు గుఱ్ఱము తోపు ఖానా అసంఖ్యేయముగా కనుబడగా చూచి.

14. తమసైన్యములో కొందరు బుద్ధిమంతులైన ముఖ్య సరదార్లనున్ను సిద్దీహిలాలును పిలిచి ఫౌజు విస్తరించి కనుబడుతున్నది. మీరుసాహేబు ఫౌజు వలె వుండలేదు. బహాదరు వచ్చి వున్నట్టయితే దగా అవునుగాని యీ విస్తారము ఫౌజు మీద కార్య పెట్టి మనము క్షేమమును పొందేలాగు కనుబడలేదు. మీరుసాహేబు ఫౌజే అయినదిన్ని లేక ఖుద్దు బహాదరే వచ్చివున్నదిన్ని మనకు యేవిధముగా తెలియవలెనని యోచన చేస్తూ వుండగా, అందులో ముఖ్యమైన కొందరు సరదార్లు మేము పోయి యెదిరి సత్తె కని వస్తున్నామని పది మంది సవార్లు బహాదరు తట్టున వున్నగుఱ్ఱపుసవార్లమీద నడిచి బహాదరు తాలూకు వొక, సవార్ను, జాయా చేసి ప్రాణముతో పట్టితీసుకొని పోయి తమదండులో వేసుకొని యీఫౌజుతో వచ్చిన సరదారుడు యెవడని అడిగినారు. అందుకు ఆసవారు చెప్పినమాట. బహా

దరు, టీపు యిద్దరు వచ్చి వున్నారు కాబట్టి యీసమయమందు యీక్షేమము కాగలది లేదు. మీయందు వూర్జితమున్నట్టయితే యిప్పుడు కార్యపెట్టక వెనక్కుతిరిగి లేచి పోవలసినదని చెప్పగా.

15. ఆమాటలు హుసేనుమియ్యా గఫూమియ్యా విని కాలవిడంబము వుంటె తిరిగిపోవలసినది గాని యింత తటస్తమైనవెనుక తిరిగిపోవడమునల్ల పౌరుష హాని మాత్రమే కాని క్రియను పొందదు. గనుక లడాయి షురూ చేయవలసినదే అని యావత్తైన్య మున్ను తోఫుఖానా తయారుచేసుకొని అంబారి యేనుగులకు సంకిళ్లు వేయించి పైన వ్రాసిన పౌర్ణమి నాడు రాత్రి రెండు ఝాముల వేళ యుద్ధారంభము చేసినారు. తదారభ్యము తెల్లవారే పరియంత్రమున్ను వుదయమైన తర్వాత నాలుగు ఘడియల ప్రొద్దు అయ్యే వరకున్ను బహదరుతట్టు ఫౌజుతోటి అఘోరమైన యుద్ధము చేసినారు. అంతట హుసేనుమియ్యా గఫూమియ్యా వారితట్టున విస్తరించి ఫౌజు చిన్నాభిన్నమైనది గనుక నిభావు చేయలేక హతశేషులయిన సైన్యముతో రెండు యేను

గలను వెనక్కు తిప్పుకొని మిట్టమానిపల్లె అనే గ్రామము నైపున మార్గము పట్టి పోతూవుండగా బహాదరు తాలూకు కరోల్‌స్వార్లు వెనుదగిలి హతశేషులయిన ప్రజను సహా చంపిరి. పాడ్యమినాడు పగలు రెండు ఝాముల య్యే వేళకు హుసేనుమియ్యా గఫూమియ్యా వారి యేనుగలు రెండున్ను దువ్వారికి ఆమడన్నర దూరమున వున్న మిట్టమానిపల్లె అనే గ్రామమువద్దికి వచ్చేవేళకు బహాదరువారి తాలూకు కరోల్‌స్వార్లు దండు వచ్చి యేనుగలను చుట్టుకొని నిలిపినంతట.

16. ఉభయులున్ను బహాదరు చేతికి చిక్కిరి గనుక వారిని వెంట తీసుకొని బహాదరు యెకాయకీన వచ్చి సిద్ధవటానకు వుత్తరభాగమందున పరుగుదూరమున వున్న గడదామరాయి అనే చీకటితోపులో దిగి హాలీంఖానుణ్ని తనభేటికి రమ్మని వర్తమానము అంపించగా హాలీంఖానుడు భేటికిపోక మునుపు తాను కైదుచేసి వుంచిన రూపరాము అనే కాయస్తువాణ్నిన్ని అప్పుడు కైదు విడిపించి అతణ్నిన్ని గయాసాహేబు అనే తురకనున్ను యిద్దరిని బహాదరు వద్దికి

పోయి సలహాచేసుకొని రాజకార్యము కుదుర్చుకొని రమ్మని పంపించగా.

17. వారు వుభయులున్ను బహాదరు వద్దికి వచ్చి ద్రోహబుద్ధి గలవారై బహాదరులో కలుసుకొని మావెంట కొంత దండు పంపిస్తే కోటలో ప్రవేశము చేయిస్తాము. అంతట వెనకనుంచి ఫౌజు తయారై వస్తేకోట తాణా పడుతున్నది. అని చెప్పగా. బహాదరు కొంత దండు వీరివెంట పంపించగా రూపరాము గయాసాహేబు యిద్దరు ఆదండువెంట బెట్టుకొని కోట గుమ్మ్యుమొదటికి వచ్చిన వెనుక హాలీముఖానుని అల్లుడు మొదలైనవారు చూచి హాలీముఖానునివద్దికి పోయి సలహా చేసుకొని రమ్మని పంపించిన రూపరాము గయాసాహేబు వీరు యిద్దరున్ను బహాదరు తాలూకు ఫౌజును వెంటబెట్టుకొని వస్తున్నారు గనుక మోసమైనట్టుగా తోస్తున్నది.

18. అని చెప్పగా ఆ హేతువ తెలియగలందులకై రూపరాము గయా సాహేబులవారికి యెదురుగా యిద్దరు తగు మనుష్యులను హాలీముఖానుడు పంపించగా వారు వచ్చి రూపరాము గయాసాహే

బునుమాచి మీరు సలహాకు పోయి వుంటిరి గదా యిప్పుడు బహాదరు తాలుకు ఫౌజును వెంట బెట్టు కొని రావలసిన హేతువు యేమి అని అడగగా, వారు విని మేము రాజకార్యముతో చేరిన సంగతు లకు యీావత్తు సలహా కుదుర్చుకొని వచ్చినారము, ఆమాటలు మేము నవాబుహాజూరున విన్నపము చేస్తున్నాము. మేము వచ్చేటప్పుడు బహాదరువారు చెప్పిన సంగతి యేమంటే మీారు వచ్చి సలహా మాట్లాడినందువల్ల మేము ఆమోదించినారము. మీా వెంబడిగా మా తాలుకుకొంత దండు వస్తు న్నది. యీదండు కోటలోపల వకసారి అలంగం తిరిగి రావలసినది. యిందుకు మీాకు సమాధాన మైతే మీా మాటకు మెచ్చుకున్నాము. లేకపోయిన పక్షమందు మీా మాటకు మేము మెచ్చేది లేదు. మీా కోట తాణా వేస్తున్నామని చెప్పినారు గనుక మేము సలహాను వుద్దేశించి యిందుకు అనుకూలించినందున బహాదరు తన తాలూకు దండును మా వెంట పం పించినాడు. మీారు నవాబు హాలీముఖానునివారి క్షేమమును అపేక్షించినవారైతే యీాసంగతి హా జూరిలో యెరుక చేసి వచ్చినదండు కోటలో అలంగం

తిరిగి పొయ్యేటట్టు చేయ వలసినది. సలహాను గురించిన వర్తమానములు మేమే హుజూరున మెరుక చేస్తున్నాము అని చెప్పగా.

19. వారు పోయి యీ నడిచిన వర్తమానము హాలీముఖానునివారికి యెరుక చేయగా మంచిదని అనుకూలించినాడు. రూపరాము గయాసాహేబుతో వచ్చిన దండు కోటలో ప్రవేశించిన మరికొంచము సేపటికి బహాదరు తాలూకు మరిన్ని కొంత దండున్ను కరోలుసవార్లుకొంత నట్టి తురుపున్ను వెనకనుంచి తయ్యారై కోటముందరికి వచ్చి కూడుకొని వుండగా.

20. నవాబు హాలీముఖానువారివద్ద ముఖ్యస్థులైన వారు కొందరు అతని దగ్గిరికి పోయి బహాదరు తాలూకు ఫౌజు యీవత్తున్న తయ్యారై కోటముందరికి వస్తున్నారు. యిఖ అనుమానించడమునకు పని లేదు. హుకుమయితే యుద్ధమునకు ప్రయత్నము చేస్తున్నామని చెప్పగా రూపరాము గయాసాహేబు యిద్దరు దగ్గిర వుండి బహాదరు ఫౌజుకోట వెలపటికి వచ్చిన మాత్రానకే కాబొయ్యేది యేమి కోటలో

నికివచ్చి వున్న దండులోన అలంగం తిరిగి, తిరుగా వెలపటికి పోయి వెనుక సలహా కుదరనై వున్నది గనుక యిప్పుడు రాచకార్యము ఖలలుచేయవద్దని ఆ యిద్దరు చెప్పగా.

21. హాలీముఖాను, వారిమాటలు విశ్వసించి బహాదరువారిమీాద కార్య పెట్టనద్దని తమ తాలూకు మందికి హుకుము చేసిరి. కోటలోకి వచ్చినదండు కోటలో వుండగానే, వెలపటినుంచి ముందర కొంత దండున్ను ఆవెనక కొందరు కరోలు స్వార్లు కోట లోనికి అయి వస్తూవుండగా హాలీముఖానుతాలూకు కొందరు దేవిడీతట్టున వుండి గుండు చలాయించి పది తుపాకులు కాల్చిరి. అంతట బహాదరు ఫౌజు విస్త రించి వున్నదిన్ని విశేషించి బందోబస్తుగా వస్తూ వున్నదిగనుకనున్ను వారిని లక్ష్యము చేయక కోట లో వచ్చి ప్రవేశించిరి.

22. అంతట తత్పూర్వము గోటలోవున్న బహ దరు సైన్యము, హాలీముఖాను మహాలు పడద్రో చిరి. యింతలో బహాదరున్ను యావత్తైన్యముతో లోనికి వచ్చి హాలీముఖానుణ్ని స్త్రీబాలవృద్ధులతో

కూడా కైదుచేసి శ్రీరంగపట్నానకు సాగనంపినాడు. కోటలో హాలీముఖానుని సొత్తులు కడపలో వున్నది సహా కొలదినములలో శ్రీరంగపట్ణానికిపంపించి కడప సిద్ధవటము రెండున్ను బహాదరు తనతాణా వేసుకొనెను. యీ వరకు హాలీముఖానుడు గూ పద్దెనిమిది యేండ్లు యేలినాడు. యీ హాలీముఖానుని యేలికలో సిద్ధవటముకోటలో వున్న దేవాలయములు బొత్తిగా ఖిలమై పోయినవి.

స్త్రీ చమత్కార కథ.

వుత్తరాదిశీమలో ఒక గ్రామములో అన్న తమ్ములు యిద్దరు, వీరు విభాగములై యిల్లు వాకిలి పెరడు పంచుకొన్నారు. వారి పెరట్లో ఒక భావి వున్నది. ఆ భావి తొవ్వి కట్టించడమునకు సుమారు 100 వరహాలు పట్టును. యెందుకంటే ఆ భూమి చట్టుగనుకనున్ను వూట లేనిది గనుకనున్ను బహు లోతున నీళ్లు కలది గనుకనున్ను ఆ ప్రాంత్యం వూళ్లల్లో రెండు వూళ్లకు మూడు వూళ్లకు అటువంటి భావి ఒకటి కలిగి వుండును గనుక యీ అన్న తమ్ములు

యిద్దరున్ను తమ పెరడు పంచుకొనేటప్పుడు తమ్ముడి పాలికి వచ్చిన భూమిలో యీ భావి వుండెను. అన్న పాలికి భావి లేనందున వారి పెరట్లోనుంచి వీరి పెరటికి ఒక కంతదోవ పెట్టుకొని నీళ్లు వాడుకుంటూ వుండిరి. అటువెనక కొన్ని దినములకు వీరికి వారికి గ్రామ దాయాద్యం వల్ల ఒకరికి ఒకరికి కలహములై ఒకరింటి కాకి వకరింటి మీద వాలకుండా నిండా ద్వేషము కలిగెను. అప్పుడు యీ తమ్ముడి కుటుంబ మువారు యీ అన్న కుటుంబమువారి మనుష్యులు పెరటి భావికి నీళ్లకు రాకుండా దోవ బిగించిరి. ఆ అన్న బహుసాధువుగావుండేవాడు, యీ తమ్ముదు ఆ గ్రామమునకు వాచాళకుడున్నూ నిండా సర్కారులో చాలినవాడున్నూ కాపుకరణాలు స్వాధీనము గలవాడున్ను అయినందువల్ల యీ గ్రామము యీ వుభయులకు యేకభోగమై వుండడము చేతను యీ తమ్ముడికి అన్నభయపడుతూ వుండును. యీ తమ్ముడు అన్నను వోడించి అందులోవచ్చిన ఫలమును తనకు కావలసినంత అనుభవించుకొని అన్నకు లెక్కచెప్పక కొంచం అన్న వస్త్రములకు

మాత్రం అరదట్లుగా* తిరిపెమిచ్చినట్టు కసురుకుం టున్నా బెదిరిస్తున్నా అప్పుడప్పుడు అప్పుసప్పుగా ఆగ్రామ కాపుల వల్ల యిప్పిస్తూ వచ్చును. యీ అన్న మేదకుడైనందువల్ల అతను యిచ్చిన మట్టుకు తీసుకొని జీవనము చేస్తూ వుండగా అతని భార్య బహు గయ్యాళిన్ని బీదపడినదిన్ని యింటికి పెద్ద కోడలున్నూ అయి వుండగా తనకు కట్టుకొనేటం దుకు వస్త్రము కూడా గతిలేకుండా వుండడమున్నూ ఆ తమ్ముని భార్య బిడ్డలు సొమ్ములు పెట్టుకుని మంచి చీరలు కట్టుకొని లెస్సా నెయ్యి పెరుగు షడ్రసో పేతముగా భోజనము చేస్తూన్నూ మాటిమాటికి పండుగ పర్వములు చేసుకొంటున్నూ చుట్టాల పక్కాల విచారిస్తున్నూ పదిమందిలో బహు ప్రతి ష్ఠగా వుండడమున్నూ చూచి సహించలేక వారిని మాటిమాటికి తిట్టుతూ వచ్చును. మగవాడు తన భార్యతో నీవు యెందుకు వారిని తిట్టుతున్నావు. వారి పుణ్యాన యింత గంజి తాగుతున్నాము. యీ కూటిలోనున్నూ రాయి వేయక యింతమాత్రమై నా జీవ ధార పోయనియ్యకుండా నీవు విరోధము

* అనగా చాలీచాలక.

చేయవద్దని మగడు చెప్పినప్పటికిన్ని ఆ యాడది నీవు అనాథవు నపుంసకుడవు నిన్ను కట్టుకొన్నందుకు నాకు యేమి సౌఖ్యములేదు వారంతా నన్ను యెగతాళి చేస్తున్నారు. అని నిత్యా జగడము పెట్టుతూ వుండును. యీ జగడముల వల్ల పెరటి భావి నీళ్లకు పోవడము మామూలే తప్పిపోయెను. వూరి బయిట సుమారు కోశెడు దూరములో ఒక భావి వుండును. అందులోనుంచి యీ పెద్దకోడలు ప్రతి దినమున్నూ నీళ్లు మోసుకొంటూ కష్ట పడుతూ వుండును. యిట్లా కొంత కాలమునకు ఆ పెద్దకోడలు కాలంచేశెను. అటువెనక వారి చుట్టాలలో ఒకరు అభిమానించి యితడికి భూజీవనము వున్నది మనపడుచునుయిస్తే కొంతకాలమునకైనా సుఖపడునని యెంచి కన్యాదానముచేశి పెండ్లిచేసిరి. అటువెనక కొన్ని దినములకు ఆచిన్నది పెద్దమనిషిఅయి యింటికి సంసారమునకు వచ్చెను. పొరుగింటివారు వాకిట్లోనైనా పెరట్లోనైనా యీపెను చూచినప్పుడు పెద్దాపె వారుకున్న తక్కువ యీపె వారుకోబోతున్నది అని యెగతాళిచేస్తూ వుందురు. యీ చిన్నది బహుబుద్ధిశాలిన్ని బహుదూరాలోచన తెలిసి

నదిన్ని బహు యుక్తి కలది గనుక వారు యేమి యెగతాళిచేశినా మారుత్తరం చెప్పక క్రోధము మనస్సులోనే యిమిడ్చుకొని యేలాగైనా వీరిని అణగగొట్టి ఆ గ్రామవ్యవహారము తనమగడిచేత నే చేయించి వీరి గర్వము అణచవలెనని యెంచి సమయము నిరీక్షిస్తూ వుండెను. అటువెనక కొంత కాలమునకు తన మరిది పెరట్లోగాని వాకిటగాని వొంటరిగా వుండేటప్పుడు నవ్వుతూ సాభిప్రాయముగా చూస్తూ యేదైనా ఒక నెపము పెట్టుకొని మాటలాడుతూ తన సౌందర్యమును అతనికి అగుపరచి అతడియందు అనురాగము కలదానివలెనే నటిస్తూ వుండెను. అతడున్నూ తన అన్న దేబె అనిన్ని తాను బహు ఘట్టివాడనిన్ని ఈ పడుచు మంచి వయసుకలిగినదనిన్ని తనకు గ్రామములో పెత్తనము జరుగుతున్నదనిన్ని తన్నుయెవరు దండించేవారు లేరనిన్ని తన భార్య 10 మంది బిడ్డలతల్లియై ముసలిదైనదనిన్ని యీపడుచును సులభముగా మనము గ్రహించవచ్చును అని యెంచి దాని మోహము యథార్థమని తలచి యితడున్నూ ఆ పడుచు యెప్పుడు పెరట్లో వాకిట్లో వంటరిగా

అగుపడునో అప్పుడంతా నవ్వుతూ విలాసముగా యేదైనా ఒక చేష్టలు చేస్తూ ఆపెతో సరససల్లాపములు జరిగిస్తూ వుండును. మరి కొంత కాలమునకు అతడికి విరహ వేదన కలిగి యీ పడుచును చూచి నీమొగుడు శుద్ధ నపుంసకుడు మునుపటి భార్య చచ్చి సుఖపడినది అట్లా కాకుండా నీవు నాకు విహితురాలవుగా వుంటే నీకు మంచి చీర లిప్పిస్తున్నాను అనిచెప్పెను. ఆమాటలు విని యీ పడుచు తమ దయకు కనిపెట్టుకొని వున్నాను. నన్ను మీ సొమ్ముగా యెంచుకొని మీ యిష్టప్రకారము జరిగించ వలసినది. మీకు యేమి అడ్డి వున్నది గనుక మిమ్మున వినాయించి నాకు యేమి తార కము వున్నది. మీరు అట్లా ఖేదముగా విచారించ పనిలేదు. మీకు యెప్పుడు సమయమో అప్పుడు మీ యిష్టమునకు సిద్ధముగా వున్నాను. అయితే నాకు నిత్యా వూరిబైట కోశెడు దూరమునుంచి యింటికికావలిశిన నీళ్లు మోయడమునకే పొద్దు సరిపోతున్నది. మీ పెరటిభావికి దోవ యిచ్చి నేను వస్తూ పోతూ వుండేటప్పుడు మీ యిష్టమును జరి గించమంటే అవుతున్నది. తమరున్నా యీ కంత

దోవగుండా మాపెరటికి మా యింటికి సమయమైన ప్పుడు వస్తూపోతూ వాడికెచేస్తూవుంటే లెస్సగా వుం డునని చెప్పెను. ఆమాటలు విని రొట్టెవిరిగి నేతి లో పడ్డదని యెంచుకొని అతడు మర్నాడే ఆభావి దగ్గరదోవ కొట్టించి వారికి నీళ్లకు దోవ యిచ్చెను. అది మొదలుకొని నిత్యమున్నూ ఆభావిగట్టునకూ ర్చుండి ఈపె నీళ్లకువచ్చినప్పుడంతా పనిలేకపోయిన ప్పటికిన్ని యేదో ఒక నెపముచేతను ఆ పడుచు దగ్గి రికిపోయి యివతల అవతల యెవరు లేకుండా చూ చి గుసగుసలాడుతూ యెప్పుడు సమయమని అడు గుతూ వచ్చెను. ఆ పడుచున్నూ యితడికిమో హాము తలకెక్కేమట్టుకు యిదిగో అదిగో అని అబద్ధపు గెడువులు పెట్టుతున్నూ ఒకనాటిదినం అతడు నిండా బలవంతము చేయగా ఒక వుపాయ ము చెప్పెను. యేమంటే తన మగడు యెప్పుడూ ఆడదానివలె యింట్లోనే వుంటున్నాడు. యితడు బ యిట తిరిగి కచ్చేరికి పోయి గ్రామసంగతులు అప్ప టప్పటికి చూస్తూ వస్తే మన వ్యవహారము మనము సొంతముగా చేసుకో వచ్చునని యెంచి యీమరి దితో తమరు యీసారి వాయిదా వరహాలు కచ్చే

రికి కొంచపోవడమునకు తీరదని చెప్పి ఆ ముదుపు గ్రామములో వుండే కరణము కాపు మహాతాదు తలారి మొదలైన శిబ్బందీలను కూర్చి మా యజ మానుణ్ని పంపించినట్టు లయితే మనము యిద్దర మున్నా మాయింట్లో నిరాటంకముగా వుండవచ్చు ను. నీయిష్టము జరిగించుకో వచ్చుననిన్ని చెప్పినది. ఆ మాట విని బహు సంతోషించి మర్నాడు ఆ గ్రామములో గూకలు వసూలు చేశి తండాయిం వశం చేశి కరణమును పిలిచి యీసారి కచ్చేరికి రావ డమునకు తీరదు మా అన్నగారిని పిలుచుకుని మీ రంతా పోయి కిస్తీ చెల్లించి రమ్మనిచెప్పగా వారు ముదుపు తయారు చేసుకొని యీయనను పిలుచు కొని పోయిరి. నాటిదినం యెప్పుడెప్పుడు సమయ మౌనా అని ఒకనిమిషము ఒక యుగముగా యెం చుకుంటూ ఆ పడుచు యెప్పుడెప్పుడు వొంటిగా తాను వుండేటప్పుడు యీ పెరటి వాకిట సందర్శిం చునో అని ధ్యానము చేస్తూ గుటకలు మింగుతూ యెదురు చూస్తూ వుండగా ఆ పడుచు యితని సం గతి వూహించి పెరటి వాకిట యింకాకొంత శేపు కుక్కవలె పడివుండనీ నాలుగు ఘడియలు తాళి పో

దాముని యెంచి ఆలస్యము చేశి అటువెనక యెవ్వ రూ లేకుండా చూచి సౌజ్ఞ చేశి అతణ్ని త్వరగా తన యింటికి రమ్మని చెప్పెను. అప్పుడు అతను గంధ ము పూసుకొని పువ్వులు పెట్టుకొని పోగులు పెట్టు కొని రవశెల్లా సరిగంచు ఖండువా దుప్పటి వల్లెవా టు వేసుకొని బహుకుశాలుగా పెరటి వాకిటి గుం డా యీపె యింటికి వచ్చెను. రాగానే యీ పడుచు తన పడకటింట్లో మంచము వాల్చి తట్టలో వక్క లాకులు పెట్టి యితణ్ని మంచము మీద కూర్చుండ మని తిన్నగా బయిటికివచ్చి అత్తగారు పండుకొని వుండగా ఆ ముసలామెను యేమో ఒకపని వుండి నట్లు పిలిచి యీలోగా యితనివద్దికి వచ్చి నీవు కుయ్యకుండా ఘడియశేపు యీ మంచము మీద ముసుకు బెట్టుకుని వుంటే నేను అత్తగారికి భోజనము పెట్టి ఆమెను పండబెట్టి వస్తానని చెప్పి ఆ పడకటిం టి తలుపు బైట గొళ్లెం పెట్టి చప్పుడు కాకుండా బీ గమువేశి ఆబీగము భద్రము చేశి ఆ ముసలామెతో లేనిపోని మాటలు ముగియకుండా తెల్లవార్లు యీ పడుచు మాట్లాడుతూ వుండెను. అటువెనక ప్రొద్దు ననే లేచి యింటిపని చేసుకుంటూ వుండెను. అప్పు

చు యీా మరిది యీా పడుచు యేవేళకు రాక పోవ డము వల్ల తన్ను మోసముచేశినదని తెలుసుకొని దిగులుపడి తన మానమున్ను తన భవిష్యమున్నూ యిఖమీాద తాను కాపాడుకోవలెనని దీని వలలో పడితి నని స్వామీా యిఖమీాద నాకు యేమి గతి యని సందడి చేస్తే ఆ గోడవెనకనే తమ వారికి అం దరికీ తెలుస్తున్నది అని చెప్పి సందడి చేయక పోతే అన్నము నీళ్లు లేక యెండి చావవలె ననిన్ని యెప్ప టికైనా యీా గుట్టుబైట పడకగాని తనకు విడుదల కాదని యెంచి ఆ కొట్టిడీలో నుంచి మాటిమాటికి దీన స్వరముగా ప్రియ వచనములుగా పిలిచి పిలిచి రోశి ఆశ నిరాశ చేసుకొని తలుపు కొట్టి ఘట్టిగా పిలిచెను. అటువెనక ఆ అత్తగారు విని యెవరు యిం ట్లో సందడి చేశేది అని అడిగెను. అప్పుడు యీా పడుచు యీా సంగతి యావత్తున్నూ అత్తగారితో యే కాంతముగా చెప్పి తన మొగుడి దగ్గిరికి ఒక మనిషిని పంపించి యతణ్ని పిలుపించుకొని గ్రామ ములో వుండే కాపు కరణాలు మొదలయిన వారిని పిలిపించి గుంపు గూర్చి కిటికీ తెరిచి ఆ కొట్టిడీలో వుండే మరిదిని అందరికి చూపించి అతని దుర్మార్గము

ను అందరికి తెలియచేశి ఆగ్రామస్తులతో మనవి చేసుకొని మీాగంతా పెద్దలు నేను చిన్నదాన్ని మా పొరుగు యిటువంటి ఛండాలవు పొరుగు మాయజ మానుడు బహు సాధువు యీా మరిది బహు దుర్మా ర్గుడు యిందువల్ల మీారు యోచించి యీాదినము మొదలుకొని నాకు యితడి వల్ల యే వుపద్రవము లేకుండానున్నా కరణాలు యీాగ్రామలెఖలు తెచ్చి మావారు విభాగాలుఅయినది మొదలుకొని నేటి వరకు యితడు అదర్గళము చేశి మాకురావలశిన ఫల ము యేమి తిన్నాడో ఆ లెఖలు యేర్పరచి యీా గ్రామం చకుబందీ చేశి మా భాగము మాకు యిచ్చి ఆ భాగము జోలికి యితడు యంతమాత్రము రాకుం డా యీా గ్రామములో వుండే సంసార్లను చెరిసఘం పంచి మా సంసారముమీాది అధికారము మేమే చేసుకొనేటట్టు గ్రామ సగభాగము మేమే విచారిం చుకొనేటట్టు మాకు మాయిరువుర్లకు పారీఖత్తులు కరారునామాలుపుట్టించి యిఖమీాదట మేమున్నా దేశము వొప్పందము వొక సంసార్లుగా వుండేటట్టు యేర్పరచి అటువెనుక మాకు రావలశినబాకీ రొఖ ముగా గాని ధాన్యముగా గాని వాయిదాలుగా గాని

వారికి సారిగాగాని సొమ్ముగాగాని పశువులుగాగాని బట్టలుగాగాని రత్నములుగాగాని బరాతముగాగాని అయివజు యేర్పరచి ఒకరికి ఒకరికి అర్థార్థ సంబంధము లేకుండాపరిష్కారము చేసి అటువెనక యితణ్ని తలుపు తెరిచి బయిటికి రప్పించ వలశినది అని ఈ పడుచు చెప్పగా అందరు ముక్కు మీద వేలు పెట్టుకొని ఆశ్చర్యపడి శహబాసని ఈ పడుచు యొక్క గుండె దిటవునకు మెచ్చిరి. అటువెనక ఆ పెరటిలో బావి చెరిసగము అయ్యేటట్టు తత్షణమే గోడ పెట్టించి ఒకరికి ఒకరికి బావి నిమిత్తము వ్యాజ్యము లేకుండా యేర్పరచుకొని తన యిష్టప్రకారము ఖరారునామాలు కరణముల చేత వ్రాయించి యీ దాయాది చేత చేవ్రాలు చేయించి ఆ గ్రామస్థులచేత సాక్షి చేవ్రాలు చేయించి యితణ్ని ఆ యింట్లోనుంచి తలుపు తెరిచి బయిటికి వెళ్లగొట్టించి తాను స్వతంత్రముగా తన మొగుడికి తెలిశి తెలియునందుకు యోచన చెప్పుతున్నా శత్రువులకు యెడమివ్వకుండా మహాబెట్టుగా సుఖిస్తూ వుండెను.

"గిరిన్మయూరీ" అనే శ్లోకముగురించిన కథ.

చెన్నపట్టణములో లక్ష్మీనరుసు పంతులనే ఒక వేపారి కొంచెము సంస్కృతము చదువుకొని యింగ్లీషుయందున్ను అరవమందున్ను తెలుగుయందున్ను ఫారిషీయందున్ను మహారాష్ట్రమందున్ను కన్నడమందున్ను మళయాళమందున్ను యీ విద్యలయందు కొంచెము కొంచెము పాండిత్యము కలిగి తాను అష్టభాషాపండితుడని వొక బిరుదు వేసుకొని యీ యెనిమిది భాషలలోగా యే విద్యావంతులు వచ్చినా వారితో మహావినయపూర్వకముగా ప్రసంగములు చేస్తున్ను కించిత్కారం ఆయా విద్వాంసులకు సంభావనలు యిస్తూ తాను మహాభాగ్యవంతుడై కీర్తి బొంది వుండగా ఆయన దగ్గిరికి వొక విద్వాంసుడు వచ్చి ఆశీర్వాదముచేసి తాను తర్కవ్యాకరణములయందు బహు ఘట్టివాడనిన్ని తనతో ఈ పట్నములో యెవ్వరూ ప్రసంగము చేసేవారు లేరనిన్ని ఆత్మస్తుతి చేసుకొనెను. అప్పుడు ఈ లక్ష్మీనరుసు పంతులు యెనిమిది విద్యలు తెలిసిన వాడై యుండిన్ని ఆ ఒకసంస్కృత విద్యమాత్రము తెలిసి గర్వపడి నటువంటి ఆ విద్వాంసుణ్ని చూచి మనస్సులో నవ్వుకొని లో

కాభిరామముగా కొంత సేపు మాట్లాడగా ప్రస్తా పోచితముఁగా ఆపంతులు ఒక శ్లోకము చదివెను. అది యేలాగంటె.—శ్లో. 'గిరిన్మయూరే గగనే పయోధరె లతాంతరె భాను జలేచ పద్మం ద్విలక్ష సోమో కుముదోత్పలానాం స్నేహేచ బంధు ర్నకదాచదూరః' అని ఈ శ్లోకమును చదవగా ఆ విద్వాంసుడు ఈ శ్లోకమును విని నవ్వి యీశ్లోకము శుద్ధ తప్పులు యిది తమబోటి పండితులు కూడా యిట్లా తప్పులు చదివితే యికను బాగా చదివేవారు యెవరున్నారు అని ఆక్షేపించెను.అప్పుడు ఆపంతులు యీ విద్వాంసుణ్ని చూచి తమరు తర్క వ్యాకరణముల యందు బహు సమర్థులు గదా యీ శ్లోకమును తప్పు దిద్ది సుబద్ధముగా చేసి నట్టయితే మీకు శిష్యులమైన మాబోటి వారందరమున్ను చదువుకొంటున్నాము. అనగా ఆ పండితుడు ఆ శ్లోకమును దిద్దెను. యేలాగంటె.—శ్లో. 'గిరౌ మయూరో గగనే పయోధరో లతాంతరే భానుః'యింతమట్టుకు దిద్ది వుత్తరార్థము యోచించి దిద్దవలసినది అని చెప్పెను.యీ పంతులు నవ్వి యీ పూర్వార్థమును దిద్దినందుకు వొకఫలమున్ను లేదు. వుత్తరార్థము దిద్దక పోయినందుకు

వాొక నష్టిస్ని లేదు. అయితే తమ పాండిత్యము యిం దువల్ల అందరికి బాగా ప్రకాశించినది. కడమ పాండి త్యమున్ను యిటువలెనే వుండునని చెప్పి తమరుదిద్దిన ప్రకారం యీ శ్లోకమును చదివేటందుకు వేరే ఒక కొత్తబ్రహ్మ పుట్టి కొత్తగా తమవంటి విద్వాంసులను సృజించేమట్టుకు మీారు దిద్దిన శ్లోకమును మీావద్ద భద్రముగా దాచిపెట్టవలసినదే కాని యీ లోకము లో యెవ్వరున్నూ మెచ్చరని చెప్పెను. అందుకు ఆవిద్వాంసుడు రోషపడి నన్ను యెగతాళి చేస్తు న్నావా నీవు తెలిసిన వాడవని నీవద్ద నా పాండి త్యమును ప్రకటన చేయవలెనని వచ్చినందుకు నీ యంత మూాఢుడు యీాలోకములో లేడని తెలిసెను. నీసహవాసమువల్ల నాకున్ను మూాఢత్వము వచ్చెనని చెప్పెను. అప్పుడు వీధి అరుగుమీాద యీావుభయులు కూర్చుండి ఆదోవను వచ్చే పౌర్యేపండితపామర సాధారణ జనులను పిలిచి వద్ద కూర్చుండబెట్టు కొని ఈ శ్లోకమును అడిగితే అందరున్ను ఈ పంతు లు చెప్పిన ప్రకారమే చదివిరి. ఆ విద్వాంసుడు దిద్దిన ప్రకారము ఒకరున్ను చెప్పక పోయిరి. అప్పుడు కొం దరు పండితులు అక్కడ సభగూడి యీ శ్లోకమును

పూర్వము యేకవి చెప్పినాడో అప్పుడే దిద్దవలసి వుండెను. యిప్పుడు దిద్దేవాడు పిచ్చివాడని సిద్ధాంతము చేసిరి.

ఈ కథలో అష్ట భాషలను గురించి వుదహరించి యున్నది. యీ అష్టభాషలు యేవేవో అది పరిష్కారముగా యెక్కడ చెప్పివుండలేదు. ద్విపద రామాయణములో వుదహరించబడ్డ యెనిమిది భాషలు యేవేవి అనగా, సంస్కృతము, ప్రాకృతము, అచ్చతెనుగు, దేశ్యము, గ్రామ్యము, కన్నడము, హాలేకన్నడము, అరవము; ఇట్లుండగా, వేరె కొందరు చెప్పిన పేర్లు; సంస్కృతము, ప్రాకృతము, సామాన్యతెనుగు, అచ్చతెనుగు, దేశ్యము, గ్రామ్యము, కన్నడము, హాలేకన్నడము.

ఏకాదశితాంబూలపు కథ.

ఒక బ్రాహ్మణుడు వొక అగ్రహారములో యేకాదశినాడు తాంబూలము వేసుకొంటూ వుండెను.

యుంకొక బ్రాహ్మణుడు చూచి అయ్యో వోయి బ్రాహ్మణుడా తెలిసినవాడవై యుండిన్ని యేకాదశి నాడు ప్రొద్దున నే యిట్లా తాంబూలము వేసుకోవడం యుక్తమేనా అని అడగగా వుల్లిగడ్డల కంపు పోవద్దా అని చెప్పెను. అయ్యయ్యో వుల్లిగడ్డలు కూడాతింటివా అని అడిగెను. వుల్లని చల్ది అన్నము లోకి వుల్లిగడ్డలు కొరుక్కోకపోతే సహిస్తున్నదా అని చెప్పెను. అయ్యయ్యో నేటి దినము వుపవాసం వుండగా చల్ది అన్నము కూడా తింటివా అని అడిగెను. చల్ది అన్నము తినకపోతే మేహకారకము అణుగునా అని చెప్పెను. ఆహా మేహకారకపు రోగము కూడానా అని చెప్పెను. ఇందునగురించి శ్లోకం. "భిక్షో మాంసనిషేవణం కిముచితం కింతేన మద్యంవినా, మద్యంచాపి తవప్రియంప్రియమహో వారాంగనాభిస్సహ, వారస్త్రీరతయే కుతస్తవధనం ద్యూతేనచౌర్యేణవా, చౌర్యద్యూతపరిశ్రమోఽపి భవతాం భ్రష్టస్యకా వాగతిః." అటువెనక వాడి యొక్క ఘనత బాగా తెలిసినది.

పొగచుట్ట కథ.

ఒకడు చుట్ట తాగుతూవుండగా ఒక పెద్దమనిషి యెందుకు చుట్ట తాగుతావు దానివల్ల యేమిన్ని సుగుణము లేక పోవడము మాత్రమే కాకుండా అనేక దుర్గణములున్నూ వున్నవి. యేలాగంటే నోరు కంపు, పొగచాతను పెదవులు నల్లగా పోవడము న్నూ రొమ్ము యెండుకొని పోవడమున్నూ దాని దురభ్యాసము చేతను సమయానికి చుట్టలేక పోతే పిచ్చిపట్టినట్టు యేమి పని తోచకుండా వుండడము న్నూ ఆపిచ్చిని పోగొట్టుకోవడమునకు బహుదీన భావముచేతను అల్పుణ్ని కూడా స్తోత్రముచేసి కొంచము పొగాకు యిస్తివంటే నీకాళ్లకు మ్రొక్కు తాను అనేటివి మొదలుగా అనేకములైన తనకు భవిష్య హానికరములయిన మాటలు చెప్పడమున్నూ యిదిగాక యెంగిలి రోత కలిగివుండడమున్నూ యిటు వంటి దుర్గణములకు మూలమైన చుట్ట తాగడమును విడవమని చెప్పగా ఆచుట్ట తాగేవాడు కడమ అన్ని ఆక్షేపణలకు యేమి సమాధానము తోచక వొక పద్యము చెప్పెను.

క. పాగికోవికి సతిమోవికి
అగణితముగ నూరభావి కమృతంబునకున్
తగనుచ్ఛిష్టము లేదని
ఖగవాహనుతోడ కాలకంఠుడు పలికెన్.

సంభాషణ సరసము.

ఈ దేశస్థులు యింగిలీషువారితో మాట్లాడడములో గాని వాండ్లకు జాబు వ్రాయడములో గాని వారికి తమయందు కరుణ పుట్టడానకై తమరే నాతల్లి తండ్రి తమరే సాక్షాత్ భగవంతుడు తమ పాదాలే నాకుగతి తమపాదాలను శరణు జొచ్చినాను అని యీలాటి మాటలను చెప్పుతున్నారు. యీమాటలు యింగిలీషుదొరలకు మహా అసహ్యకరములుగా వుంటవి. అయితే యీమాటలకు బాగా అర్థము తెలియని దొరలు వుపేక్షగా వుంటారు. అర్థము తెలిసి యీ దేశస్థులతో బహుదినములుగా వాడుకపడ్డ దొరలు యిది వీండ్లకు వుండే వక పిచ్చి గుణమని తమకువచ్చే అసహ్యమును అగుపరచరు. అందువల్ల యీమాటలు వారికి సంతోషకరములుగా వున్నట్లు

యీదేశస్థులు భ్రమపడుతున్నారు. యింగిలీషువారి కాళ్లమీద పడితే వాండ్లకు యెంతమాత్రము కరుణ రాకుండా మహత్తైన అసహ్యము వస్తున్నది. తమరే నాతల్లిదండ్రి అని అంటే తన తలిదండ్రుల యెడల వీడికి వుపకారస్మృతిలేక వాండ్లకు ద్రోహియై పరులను తన తలిదండ్రులుగా భావిస్తాడని పరిహాసము చేస్తారు. తమరే నాపాలిటి దైవమని అంటే మనిషియందు దైవత్వమును ఆరోపించే దైవద్రోహియని యింగ్లీషువారికి వచ్చే కోపము యింతంతకాదు. రాజులనున్ను పెద్దలనున్ను స్తుతించడమునకు పంచతంత్రములోనున్ను యింకా కొన్ని హిందూగ్రంథములలోనున్న యుక్తులు చెప్పివున్నవి. మెట్టుకు స్తుతించేవాడు వంచకుడనిన్ని స్తుతికి సంతోషించేవాడు జడుడనిన్ని యింగ్లీషువారిసిద్ధాంతము. యీసరసము యెరిగి యింగ్లీషువారితో మాట్లాడవలసినది. వాండ్లవద్ద నక్కనైచ్యములు పనికిరావు.

నవాబు రూపాయీల కథ.

తిరువల్లిక్కేణిలో నవాబుకు కుంపిణీవారు ప్రతి సంవత్సరం పంజంహిస్సారూపాయిలు యిస్తూవుండ

గా, పూర్వం పారిషీ అక్షరాలుగల ముద్రతో వుండే కుంపిణీ రూపాయలు చలామణి అవుతూ వుండగా ఆరూపాయీాలే నవాబుకు ప్రతిసంవత్సరం యిస్తూ వచ్చినారు యిట్లావుండగా ఆన 1842 సం. కుంపిణీ వారు రాణిముఖముగల ముద్రరూపాయలు టంక సాల వేయించి క్రొత్తగా చలామణి చేయిస్తూ ఆరూ పాయీాలు నవాబుకు పంజంహిస్నా తాలూకు వాయిదా పైకము చెల్లించగా యీానవాబు గర్వపడి మాఫారిషీముద్ర లేని రూపాయీాలను మేము ము ట్టేది లేదు. మాదర్బారులోకే కూడదని ఆసంచులు తిరిగీ నవాబు కుంపినీవారికి వాపసు పంపించి వేసినా రు.ఆసంగతి గౌనరు మొదలయిన యింగిలీషుదొరలు విని నవ్వుకొని అయితే యీానవాబు యీాక్రొత్తరూ పాయీాలను యెన్నాళ్లదాకా తాకకుండా వుంటు న్నాడో చూతామని యోచనచేసి పూర్వపు పారిషీ ముద్రగల రూపాయీాలనే నవాబుకు పంపించినారు. అటువెనుక యీాపాతరూపాయీాలు తమఖజానాలో వస్తే వాటిని టంకసాలకు పంపించి కరిగించేటట్టున్ను యీాక్రొత్తరూపాయీాలే జీతములు మొదలయిన వాటికి యిచ్చేలాగు చట్టము యేర్పరచి ఆప్రకారం

గౌనరుమెంటువారు లోకులకు అందరికి యీరాణీ ముఖముగల రూపాయీలే యిస్తున్నారు. ఫార్షీ ముద్రగల రూపాయీలు తాలూకాలోనుంచి ఖజానాకు దాఖలు చేయబడ్డరూపాయీలు అన్నిన్ని కరిగించి కొత్తరూపాయల వేయిస్తూన్నారు. యిట్లావుండగా యీనవాబుకు చెన్నపట్నం గుండు సాలకులోగా అనేక తోటలున్ను అనేక అంగళ్లున్ను సుమారు సంవత్సరమునకు యిరవై వేల రూపాయీలు బాడిగెవసూలు చేస్తూవుండగా అందులో వెయ్యింటికి పదిరూపాయీలైనా ఫారిషీ ముద్రగలవి వసూలు కాకపోయెను. అప్పుడు ఆనవాబు తనకువచ్చే బాడిగెలు తానే హర్కతు చేసుకుంటె ఆనష్టి సమాళించుకోవడమునకు యేవుపాయము లేక ఆరాణీముఖముగల రూపాయీలే వసూలుచేసుకొంటూ వచ్చినాడు. తనవద్ద జీతగాండ్లకు కొత్తరూపాయీలే యిస్తూవచ్చినాడు. అటువెనక మళ్లీ పంజంహిస్సా వాయిదా వచ్చినప్పుడు గౌనరుమెంటువారు నవాబును యీకొత్తరూపాయీలను పంపిస్తే ఆనవాబు తీసుకోడో యేమో అని సందేహించక అన్ని కొత్తరూపాయీలనే పంపించినారు. ఆరూపాయీలను నవాబుచూచుకొని శిగ్గుపడి కొంత

నేపు తలవంచుకొని పూర్వము యీకుంపిణీవారు యీరూపాయీలను మనకు పంపిస్తే వారిని లక్ష్యపెట్టక తిరిగీ పంపిస్తిని. యిప్పుడు యీరూపాయీలను అలాగే తిరిగీ పంపిస్తే మన భవిష్యము పోవును అని దొంగకు తేలు కుట్టినట్లు యేమి ఆక్షేపణ చేయకుండా యీరూపాయీలయినా మనకు వారు పంపించినదే మేలని వొప్పుకొని వుండెను. యీసంగతి గానరుమొదలయిన యింగిలీషుదొరలు విని కొందరు యెగతాళి చేసిరి, కొందరునవ్విరి.

సమయసూ్ఫర్తిగా చెప్పిన వాక్యమును గురించినకథ.

ఒక ప్రభువు వొక తోటలో భూరిదక్షిణకు వచ్చిన ప్రజనంతా నిలిపి తలవాకిట తాను వుండి భూరి యిస్తూ వుండగా వొక మాటు దక్షిణ తీసుకొన్న వాడు మరియొకతట్టుగా పోయి, గోడ యెక్కి దుమికి వచ్చి మళ్లీ దక్షిణకు చెయి చాచెను. అప్పుడు ఆప్రభువు వానిముఖము చూచి ముందు దక్షిణ తీసుకొని పోయినవాడు మళ్లీ వచ్చినాడని యెగతాళిగా "పునరాయాన్మహాకపిః" అనగానే లటక్కున ఆచెయి చాచినవాడు "రామాయ ప్రియ మాఖ్యాతుం"

అని అన్నాఁడు. సమయస్ఫూర్తిగా ముందువాక్యము వాఁడికి తోఁచినందున ఆప్రభువు నిండాసంతోషించి వానికి పిడికెడు రూపాయలు యిచ్చి పొమ్మనెను.

వెర్రివాండ్లపట్టీకథ.

గుర్రాలమ్మే సౌదాగరు వొకడు పాచ్ఛా దగ్గరికి వచ్చి ఆయనకు కొన్ని శ్రేష్ఠమైన గుర్రములు అమ్మినాడు. సుల్తాను ఆగుర్రాల క్రయం వానికి యిచ్చి వాణ్ని వెళ్లుమనేటప్పటికి అయ్యా యింకా పదివేల రూపాయలు తమరు ముందుగా యిచ్చినట్టయితే మా దేశములో యింకామంచి గుర్రములున్నవి వచ్చే సంవత్సరము యీదినాలకు తెస్తానని చెప్పినాడు. అందుకు పాచ్ఛాగారు ఆమోదించి వానికి పదివేల రూపాయలుయిచ్చి పొమ్మన్నారు. పిమ్మట కొన్నిమాసములకు తర్వాత పాచ్ఛాగారున్ను వారి మంత్రిగారున్ను మాట్లాడుతూ వుండగా మన పట్నములో వీడు వెర్రివాడు వాడు చపలచిత్తుడు మరియొకడు మందబుద్ధి గలవాడు యింకొకడు బేల అని పదిమందిని దూషించి పేండ్లలో కొందరి పేళ్లును వొక పట్టీ వ్రాసి తెమ్మని సుల్తానువారు మంత్రికి సెలవిచ్చిరి.

అదేప్రకారముగా ఆమరునాడు ఆమంత్రిగారు ఆవ ట్టీని తీసుకొని వచ్చి సుల్తానుగారియెదట పెట్టెను. ఆ వెర్రివాండ్ల పట్టీలో మొట్టమొదట సుల్తాను వారి పేరు వ్రాసియుండెను. దాన్ని ఆయన చూచి నేను యీ వెర్రివాండ్ల కందరికిన్ని మొదటి వెర్రివాణ్నా అని మంత్రిని అడిగెను. అందుకు మంత్రి నిండా భయభక్తితో మహాప్రభో యింకా మంచి గుర్రాలు తెస్తానన్నదేశస్థకాకిగా తిరిగే యెవడో దిక్కుమాలిన గుర్రాలమ్మేవతనికి సంవత్సరమునాటికి గుర్రాలు తెస్తానంటే వానిమాట నమ్మి పదివేలరూపాయలు దారపోసిన తమకంటే పిచ్చివాడు భూమిలో కద్దా అని మంత్రిఅనెను. అందుకు రాజు "ఆహా ఆసౌదాగరు చెప్పిన గడువు ప్రకారం తప్పకుండా గుర్రాలు తీసుక వస్తే అప్పుడు పిచ్చివాడు యెవరని సుల్తానుగారు అన్నారు." అందుకు మహాప్రభో అంతకాలము పుట్టేటప్పటికి యీ వెర్రివాండ్ల పట్టీలో మొదటవుండే తమపేరు తీసివేసి ఆసౌదాగరు పేరును పెట్టుతానననెను.

ధర్మానికి క్షౌరముచేసికొన్న సన్యాసికథ.

రోమ్ దేశములో వుండే సన్యాసులు బయిరా

గులు పకీరు యీలాగంటివాండ్లకు ఆయా గ్రామములో వుండే చాకల మంగలవాండ్లు మొదలయిన ఆయా పనివాండ్లు దుడ్డు తీసుకోకుండా వూరికె పుణ్యానికి వారివారి పనులను చేసే మర్యాద కలదు. అటువెనక ఒక సన్యాసి ఒక మంగలవాని దగ్గిరికి వచ్చి నాకు గొరుగురా అన్నాడు. మంచిదయ్యా రండి అని కూర్చుండబెట్టుకొని రూకలు యిచ్చేవాండ్లకు గొరిగేమంచికత్తులను అట్టేపెట్టి ఒకమొండికత్తిని తీసుకొని పండ్లు కొరుక్కొని అడ్డం దిగటముగా వేసి ఆసన్యాసి తలను గొరుగుతూ వుండగా సన్యాసి తేరకు గొరిగించుకొనేవాడు గనుక మంగలవాణ్ని యేమీఅనలేక తలమంట ప్రాణముపోతూవుంటే ప్రాణాన్ని పిడికిటపట్టుకొని గొరిగించుకొంటూవుండెను. యిట్లావుండగా ఆ సమీపములో ఒక పందిపిల్ల కీచుకీచుమని అరుస్తూవుండెను. ఆమంగలవాడు అయ్యో ఆపందినియేమిచేస్తారో అనేటప్పటికి ఆ సన్యాసికి కడుపుమండి ఆ పందిపిల్లకూడా పుణ్యానికి క్షవరము చేయించుకొంటూ వున్నదేమో అని చెప్పినాడు.

చిల్లర కథలు.

కృష్ణమాచార్యులుచెప్పినవి.

ఉభయులకు జయములని తీర్పునుగురించిన కథ.

శ్రీపెరుంబూదూరి ముతాదారుడు అనంతాచార్యులకున్ను ఆవూరి పెద్దకాపు రామలింగారెడ్డికిన్ని వివాదము వచ్చినది.అందునగురించి తాలూకాముననఫుకోర్టులో వ్యాజ్యము వేయబడ్డది.వీండ్లకు యిట్లా వ్యాజ్యము వుండినా అన్నదమ్ములవలె సరసముగా మాట్లాడుతూ నవ్వుతూ తుళ్లుతూ యిద్దరు ఒక యింట్లోనే భోజనము చేస్తూ వుండిరి. పైన చెప్పిన వ్యాజ్యమునుగురించి నేను యిట్లా మాట్లాడుతానంటె నేను యిట్లా మాట్లాడుతానని పరాక్రమములు పలికేవారు యిద్దరు కోర్టుకు వచ్చినప్పుడు పుంజులవలెపోట్లాడేవారు. వీండ్లు న్యాయముగా వ్యాజ్య మాడేవాండ్లు కారు తమతమగట్టితనాన్ని చూపవచ్చినారు. వీండ్లకు తగిన శాస్తిచేయవలెనని యోచించి వివాదాస్పదమైన ఆనేల కాపువశములో వుండేదాన్ని తీసి జమీన్దారుడు పరులకు యివ్వకూడదనిన్ని ఆనేల జమీందారిభూమిలో వున్నది

గనుక దానికి కాపు పన్ను యిచ్చి తీరవలసినదనిన్ని తీర్పుచేసినందున వుభయులకు వుండే వివాదము యెన్నటికి తీరనిదిగానున్ను ఆనేలయెవరికి స్వాధీనము కానిదిగానున్ను పాడుపడిపోయెను. తాలూకా మున సఫు యిల్లా తీర్పు చేసి వారిద్దరిని మొక్కపరిచి పంపెను.

శ్రీపెరుంబూదూరు దగ్గర శ్రీరామువారి పాళ యం అడవిలో వొకనాడు వొకగొల్లవాడు దుత్త లో పాలుతీసుకొని పోతూ వుండగా ఆపాలు తొణక కుండా వుండడానకు వొక గొంజి మండను విరిచి ఆ దుత్తలోవేసుకొని పోతూ వుండగా శ్రీరామభీమ నాయుడు వాణ్ని చూచి అయ్యో నా అడివిలోని చెట్టుయొక్క మండను యేల విరిచినావని యెక్కడ యేచెట్టున ఆమండను విరిచినావో నాకు చూపుమని వాణ్ని ఆచెట్టు వద్దికి పిలుచుకొని పోయి ఆదుత్తెడు పాలున్ను ఆచెట్టుకు పోయించి యిది ఆప్రాంత్య మందు వుండేవారికంతా తెలిసేటట్టు ప్రసిద్ధపత్రి కను వేయించెను.

గాలివాన.

పోయిన తూరి పత్రికలో తుఫానువలన యీారేవున సంభవించిన నష్టమునుగురించి తెలియజేసియుంటిమి గదా. అయితే యీాతూరి యీావిషయమునుగురించి మాయెదటకి వచ్చిన యుత్తరములలోని సంగ్రహమిాదిగువ నుదాహరించెదము. యీారేవున యెటువంటి నష్టము సంభవించినదో అటువంటి నష్టమే అనేక కోస్తాలలోకూడా సంభవించినట్లు కనుపడుచున్నది. పోయిన నెల 29 తేది పుదుచేరినుండి వచ్చిన యుత్తరమువలన తెలియవచ్చేది యేమంటే. ఆదివారము రాత్రి 2 ఘంటలకు గాలివాన ప్రారంభించి వురుములు మెరుపులతో కూడ బలముగా వర్షించినదిగాక మరుసటిదినమగు సోమవారము 11-ఘంటలకు వాడలకు అపాయము కలుగజేయుట కారంభించెను. తక్షణమే మేస్టర్ అటేండేటుగారు ఫిరంగి కాల్పించినందున వాడ సరదారులు లంగరులెత్తి సముద్రములోతట్టు కొంత దూరము తీసుకొని పోయిరి గాని యీావాడలలో యెనిమిది గూడలూారు

ఫరంగిపేటకు మధ్యదరితట్టినట్టు గూడలూరి కలక్టరు పుదుచేరి గౌనరుగారికి వ్రాసిన యుత్తరమువలన కనుపడుచున్నది.

అందుకు నిదర్శనముగ పుదుచేరి రేవుకు వాడ సామానులు వెలగల వస్తువలు కొట్టుకొని వచ్చెను. యీదరి తట్టిన వాడలన్నియు ఫ్రెంచిదేశపు వాడలని చెప్పుచున్నారు. యిందులో నొక యింగిలీషు వాడ కూడ కలిసి యున్నది.

నాగపట్నమునుండి వచ్చిన యుత్తరమువలన తెలియవచ్చేది యేమంటే, యీపట్టణపు కోస్తాలో మిగుల తుఫాను గొట్టినట్టు కనుపడుచున్నది. ఆది వారము సాయంత్రమువరకు గొప్ప అలలచే సముద్రము ఘోషింపుచుండెను. అందుతో కూడ కొంచెము గాలి ప్రారంభించెను. అయితే అపాయము గలుగునని యెంతమాత్రము తోచలేదు. 9 ఘంటల కారంభమైన గాలి సాయంత్ర మైదుఘంటలవరకు క్రమక్రమముగా వృద్ధిబొందుచు వచ్చినందున సదరు కోస్తాలో లంగరు చేసి యున్న జ్యూపిటర్ అను యొక చిన్నవాడు లంగరుతో

కూడ సముద్ర మగ్నమై పోయెను. మరి యొకటి దరి తట్టి బద్దలయి పోయెను. రేవున వున్న బావుటా విరిగి పడిపోయెను. అనేక దోనీలుదరితట్టెను. ప్రజా నష్టము విశేషముగా నుండినప్పటికి వివరము చక్కగా తెలియలేదు.

తిరుచినాపల్లినుండి వచ్చిన యుత్తరము వలన తెలియవచ్చేది యేమంటే, యీతిరుచినాపల్లియందు సంభవించిన గాలివానవలన యనేక గృహములు పడిపోయెను. వృక్షములు విరిగి పడినందున కొన్ని గృహములకు నష్టము సంభవించెను. కావేరిలో కట్టియున్న ౫ దొండ్లుగల వారధినాశమై పోయెను.

తంజావూరినుండి వచ్చినయుత్తరమువలన తెలియ వచ్చేది యేమంటే, పోయిన నెల ౨౬ తేది గాలి వాన గలుగుటకు చిన్హము లగుపడుచు వచ్చి ౨౭ వ తేదిన బలపడి, ప్రవాహములు విశేషముగా వచ్చి నది గాక అనేక గృహములను కూలద్రోసెను. బహు జనులు మృతినొందుటకు కారణమాయెను. పశు పక్షిమృగాది జంతువులు వనవృక్షములు నాశమై పోయెను. రయితులయొక్క పంట కళ్లములలోనుండే

ధాన్యము ప్రవాహములో కొట్టుకొనిపోయెను. యిట్టి అపాయమువలన బీదజనులు పొందెడి శ్రమ యొక్క మతింపును బుద్ధిమంతులగు వారికి తెలిసి యుండును గదా. యీడిస్ట్రిక్టులో చేరిన ట్రంకుబార్ అను స్థలమందు కూడ గాలివాన సంభవించి అనేక వృక్షములు ఫలసాయము నాశమై పోయినది గాక అచ్చట వున్న పడవలు మొదలైనవి బహు దూరము వరకు కొట్టుకొని పోయినట్టు కనుపడుచున్నది.

మరియు వేలూరు, చిత్తూరు యీ రెండు స్థలములలో ఆదివారమునాడు విశేష వర్షముతో గాలి కొట్టినదిగాక వేలూరికి సమీపమందుండే నదిలో సుమారు ౨౫ సంవత్సరములుగా చూడని ప్రవాహము వచ్చినట్టు కనుపడుచున్నది. సదరు నదియొక్క ప్రవాహమువలన తపాకట్టలు కూడ బోవుట కసందర్భము సంభవించెను. చిత్తూరు నదిలో అకస్మాత్తుగా వచ్చిన వెల్లువవలన కొందరు జనులు కొంత వరుకు కొట్టుకొని పోయినట్టు ప్రవాద పుట్టి యున్నది.

కల్లికోటలోనుండి వచ్చిన యుత్తరమువలన తెలియవచ్చేది యేమంటే, ఆదివారము సాయంత్రము ప్రారంభించి ఆరాత్రి అంతా బలమయిన తుఫాను కొట్టెను. మరుదినము వీచుచుండెడి గాలి ప్రజలకు మిగులభీతిని బుట్టించెను.

సముద్రతరంగములయొక్క ఘోష ప్రజలయొక్క హృదయములను భేదింపుచుండెను. యిట్టి అపాయములో సదరు రేవున లంగరు చేయబడియున్న యొక వాడ అపాయమును తప్పించుకొని పారిపోయెను. మరి యొకటి బలహీనముచేత దరితట్టెను. పడవలు మొదలగు మరి కొన్ని నూపము లిదివరకు తెలియలేదు. సంభవించిన ప్రజానష్టముయొక్క మొత్తము కనుపరుచుట కాధారము లేక నున్నది.

బెంగుళూరునుండి వచ్చిన యుత్తరమువలన ఆదివారమునాడు గాలివాన ప్రారంభించి సుమారు 3 దినములు పర్యంతము మితిలేనివర్షము కురిసినది గాక కొన్ని యిండ్లకును పశుపక్షిమృగాదులకును, వనవృక్షములకును విశేష నష్టముసంభవించెను.

కర్నూలునుండి వచ్చిన యుత్తరమువలన వర్షము మాత్రము విశేషముగా గురిసినట్టు కనుపడుచున్నది.

ఉత్తరదేశమునుండి వచ్చిన కొన్ని వుత్తరముల వలన కోస్తాలలో నష్టము సంభవించినట్టుగాని వర్షముయొక్క శ్రమ గలిగినట్టు గాని కనుపడలేదు.

ఈచన్నపట్నమునందు ఇతర దేశములయందు చైత్రమాసములో మిక్కిలి యుష్ణాధిక్యముగా నుండుటచేత విశేషవ్యాధులు సంభవించునని ప్రజలు మిక్కిలి భీతిజెంది యుండిరి.

అయితే పోయిన శుక్రవారము మేఘాడంబరము చేయుచు వచ్చినందున తొలకరికి చిహ్నముగా నున్నదని ప్రజలు తలచియుండిరి. ఆదినము సాయంత్రమే గాలికొట్టుటకు కొన్ని గురుతుల నగుపరచెను. ఆరాత్రి మూడుఘంటలు మొదలుకొని విశేషము వర్షించడమున కారంభించెను. భూమియొక్క యుష్ణము యీవర్షమువల్లనే నివారణ మాయెను.

గాలివాన కొట్టుటకు కొన్ని చిహ్నములగుపడుచు వచ్చినందున వాడల లంగరుల నెత్తవలయునని హెచ్చరికె చేయబడెను. శనివార ముదయము మొదలు

కొని గాలి రెవరెవ వీచుచుండి రాత్రి కొద్దిగా ప్రబలించెను. ఆదివారము పగలు ౮ ఘంటలవరకు పర్యాయముగా గాలివీచుచుండి యారాత్రి ౮ ఘంటలవరకు మధ్యమధ్య గాలివాన కొద్దికొద్దిగా తెరపనిచ్చుచువచ్చెను.

గాలివాన ప్రబలముగా నారభించి మమారు రాత్రి ౨ ఘంటల వరకు నుండి పిమ్మట దక్షిణపుగాలి వీచడమున కారంభించగానే యనేకవృక్షములు, కొన్ని యిండ్లు, పడిపోవడముమాత్రము గాక కొన్ని పశువులు అనేక పక్షులు మృతిబొందెను. సోమవారము పగలు ౮౪ ఘంటలవరకు గాలివాన బలముగా కొట్టుచుండి పిమ్మట వర్షము లేక పోయినా దట్టముగా మేఘము కమ్ముకొని పగలు ౨౪ ఘంటలకు సూర్య బింబదర్శనమాయెను.

బైట దేశములనుండి యిదివరకు మాయొదటికి యుత్తరములు రాకపోయినా సదరహీ గాలివాన బహుదూరము వ్యాపించి యుండవచ్చు నని తలంచెదము. ఈ గాలివాన కీపట్టణపు రేవులోనుండిన యోడలలో సుమారు ౧౨ వోడలు బొత్తిగా నాశమై

పోయినట్టు తెలిసినది. సముద్రపు లోతట్టుకు పారి పోయిన యోడలలో గొన్ని మాత్రము తిరిగీ వచ్చి లంగరు చేయబడి యున్నది. వోడలలో నుండెడి మనుష్యులున్ను కొందరు మృతిబొందిరి.

విరోధికృన్నామ సంవత్సర వైశాఖ బ ౧ శుక్ర వారము గాలివాన వలన యీ పట్టణమునందు సం భవించిన నష్టమును పోయిన వారపు పత్రికలో తెలియజేసి యున్నాము గదా. ఈ వసంత ఋతువులో ౩౦ సంవత్సరములలోగా నెప్పుడు గురియని వర్ష మీసంవత్సరము గురిశెను. పొదిలె మాధవరము వగైరా స్థలములలో ౧౮౭౬సం. నందు సంభవించ నట్టుంవలె కొన్ని చెరువులు తెగి రస్తాలమీదుగా ప్రవహించినందున బండ్లు పోవడమునకు వల్లలేకపో యెను. పెరంబూరు చెరువు తెగినందున రస్తాకు విశేషనష్టము సంభవించినట్టు కనుపడుచున్నది.

సదరు నెల ౩-౪ తేదులయందు గురిశిన వర్ష మును గురించిన్ని కొట్టిన గాలిని గురించిన్ని యీ వారములో గొన్నియుత్తరములు వచ్చి చేరినవి.

సదరు గాలివానవలన బైటి దేశములయందు విశేష నష్టము సంభవించినట్లును గనుపడుచున్నది.

ఈనెల ౬ తేది బెంగుళూరునుండి వచ్చినయుత్తరము ఈ నెల ౮ తేది బల్లారినుండి వచ్చిన యుత్తరమువలన ౬ తేది పగలు ౨ ఘంటలకు వర్షారంభమై మరుసటిదినము వుదయమువరకు మంచి వర్షము కురియడమే గాక కసరుగాలి కొట్టడమున కారంభించినందున సుమారు ౫౦ వేలరూపాయిల మదింపుగల సామానులు పశుపక్షిమృగాది జంతువులు నాశమై పోయినట్లును యిండ్లు పడి ముగ్గురు మనుష్యులు మృతిబొందినట్లును ౧ టోరిజిమెంటు శిపాయీలు వాసము చేయుచున్న లయనులు బొత్తిగా పడిపోయినట్లును కౌలు బాజారులోను బ్రూసుపేటలోను విస్తరించి నష్టము సంభవించినట్లును కొన్ని యాఫీసు బంగాళాలు మొదలైనవి పడిపోయినట్లును తెలియవచ్చుచున్నది.

ఈ నెల ౮ తేది మచిలీపట్నమునుండి వచ్చిన యుత్తరమువలన ఈనెల 3 తేది శనివారమునాడు కొద్దిగా గాలితోగూడ వర్ష మారంభించి మూడు

దినములు మునురు పట్టి మూాదు దుక్కుల వర్షము గురిశినట్టున్ను రు ౧౮౪ చొ ॥ యమ్ముచున్న ధాన్యము ప్రకృతము ౧౭౪ చొ ॥ విక్రయింప బడుచున్నట్టున్ను వ్యాధి బాధలు లేక దేశము సుభిక్షముగా నున్నట్టును తెలిసినదివలన ౩ తేది శనివారము మొదలుకొని ౮ తేది ఆదివారము వరకు తైలధారవతుగా వర్షము కురియడము మాత్రముగాక పర్యాయముగా గాలి కొట్టినట్టు తెలిసినది.

ఈనెల౬ తేది ఆరికాడునుంచి వచ్చిన యుత్తరమువలన సదరు నెల ౨ తేది శుక్రవారము పగలు ౧ ఘంటకు వాలాజాపేటకు పౌయ్యెడి మార్గములో గాలితో కూడా దుమ్ము లేచి సూర్యబింబమును గప్పిన పిమ్మట ౧౦ నిముషములకు వర్షప్రదమైనప్పటికి యాందినము పర్యాయముగా గాలి కొట్టుచున్నట్టును శనివారము మొదలుకొని యాదివారము సాయంత్రమువరకు గురిశినవర్షమువలనచెరువులు, గుంటలు పూర్ణతటాకములుగా నిండినట్టున్ను కొన్ని చెరువులు తెగి కొన్ని వూరి గుడిశలమీాద పడి కొట్టుకొని పోయినప్పటికి యందులో వాసము సేయుచున్న

చీదజనుల కపాయము లేనట్టును ఆత
కొట్టినగాలికి యనేకవృక్షములు కూ
గాకపశుపక్షి మృగాది జంతువులు వి స్తరించి మృతి
బొందినట్టును తెలియవచ్చుచున్నది.

స మా ప్త ము.

చెన్నపురి: వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి
ఆదిసరస్వతీనిలయముద్రాక్షరశాలయందు
ముద్రితము.—1916.

గ్రంథములు.

వచనము.

ప్రతి 1-కి		రూ.	అ.
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు, శ్రీశతఘంటము. వేంకటరంగశాస్త్రికృతము		6	8
భారతసారము, శ్రీ నాగపూడి. కుప్పుస్వామయ్యగారిది		1	0
సంగ్రహరామాయణము, సులభశైలి, శ్రీశేషాద్రిశర్మకృతము	...	0	8
సంస్కృతనాటకకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము		0	12
దశకుమారచరిత్రము, శ్రీ ఎనమచింతల. సంజీవరాయశాస్త్రికృతము	...	1	4
శివాజీచరిత్ర	...	0	6
శ్రీరామానుజాచార్యచరిత్ర	...	0	2
శ్రీశంకరాచార్యచరిత్ర, ప్రతిమతో	...	0	2
రామకృష్ణపరమహంసచరిత్ర ,,	...	0	2
బాలగంగాధరతిలకుగారిచరిత్ర ,,	...	0	2
దాదాభాయినౌరోజీచరిత్ర ,,	...	0	1
ఆనిబిసెంటుచరిత్ర ,,	...	0	1
వివేకానందస్వామిజీవితము ,,	...	0	1
శ్రీకృష్ణదేవరాయచరిత్ర ,,	...	0	2
స్వామిరామతీర్థజీవితము	...	0	1
శాలివాహనచరిత్ర	...	0	2
శ్రీబుద్ధచరిత్రము	...	0	2

		ప్రతి 1-కి రూ.	అ.
సోదరినివేదితజీవితము	...	0	2
శ్రీలాలాలాజ్ పతిరాయిజీవితము	...	0	2
శ్రీకరంచంద్ గంధిజీవితము	...	0	2
శ్రీగోపాలకృష్ణగోక్లేజీవితము	...	0	2
సూరతుకాఙ్గ్రెస్సు ఉపన్యాసములు	...	0	2
శ్రీగైక్వారుగారిజీవితము	...	0	2
దక్కనుపూర్వకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము, క్రొత్తకూర్పు	...	1	4
మైరావణచరిత్ర, చక్కనికూర్పు	...	0	1
రేచుక్కపగటిచుక్కకథలు ,,	...	0	2
మర్యాదరామన్నకథలు ,,	...	0	2
పరమానందశిష్యులకథలు ,,	...	0	3
తెనాలిరామలింగనికథలు, జీవితము	...	0	4
తాతాచార్యులకథలు	...	0	6
ఈసబునీతికథలు, క్రొత్తకూర్పు, 1-వ భాగము	...	0	6
డిటో 2-వ భాగము	...	0	8
షేక్స్పియర్ నాటకకథలు, సులభశైలి	...	1	4
అరేబియన్ నైట్సుకథలు, చక్కనికూర్పు	...	1	4
లార్డుక్లైవు జీవితము	...	0	6
శ్రీగురుజాడ. శ్రీరామమూర్తిగారిఆంధ్రకవిజీవితములు		2	8
తారాభాయి, చక్కనినవల	...	0	12
ఆనందమఠ, నవల, నూతనముద్రితము	...	0	12
రాజర్షి, శ్రీరవీంద్రనాథఠాకూర్ గారి బంగాళీనవలకు తెనుగు	...	0	10
నీతిచంద్రిక, చిన్నయసూరిగారిది	...	0	6

ఆంధ్రగ్రంథములు.

		ప్రతి 1-కి రూ.	అ.
దుర్గేశనందిని, నవల, సాధారణప్రతి	...	0	8
విపన్నో ,,	...	0	6
మదాలస ,,	...	0	10
సుజనరంజని ,,	...	0	6
టిప్పుసుల్తాన్, నూతనకవితాశైలిని, అక్కిరాజు. ఉమాకాంతముగారిచే విరచితము	...	1	4
ఉన్మాదిని, నవల	...	0	4
రాధారాణి ,,	...	0	4
లీల ,,	...	0	4
పంచతంత్రము, వచనము, సులభశైలి	...	0	6
క్షేత్రయ్యపదములు, చక్కనికూర్పు	...	0	14
నీలగిరిపాటలు, శ్రీగురుజాడ. అప్పారాయకృతము		0	8
అధ్యాత్మరామాయణకీర్తనలు, చక్కని ప్రతి, చిన్నసైజు		0	6
రామదాసచరిత్ర, చక్కనికూర్పు, మంచికాగితములు, ఇందు శ్రీరామదాసుగారి ప్రతిమకూడ కలదు.		0	8
అద్వైతసంగ్రహము, వచనము	...	0	4
వాసుదేవమననము, వచనము, మంచిఅచ్చు	..	0	14
ఆంధ్రశబ్దచింతామణి, సటీక	..	0	6
బాలవ్యాకరణము, చిన్నయసూరిగారిది	...	0	12
పెద్దబాలశిక్ష, చక్కనికూర్పు	...	0	4
శబ్దార్థచంద్రిక, శ్రీమహాకాళి. సుబ్బారాయకృతము, అకారాది ఆంధ్రనిఘంటువు	...	2	8
శ్రీవివేకానందవిజయము	...	1	8

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
192, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.

శ్రీ మహాభక్తవిజయము.

ఇదివఱకు మన ఆంధ్రభాషలో సర్వాంగ సుందరమైన భక్త విజయము ప్రకటింపఁబడియుండలేదు. ఇప్పుడే మేమాలోపమును దీర్పఁదలఁచి బ్రహ్మశ్రీ, శ్రీపాద. సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే వ్రాయించి ఈమహాభక్తవిజయమును ప్రకటించుచున్నారము. శ్రీ శాస్త్రిగారి మృదుమధురమగు శైలి, ముద్దులు మూటగట్టు పదరచన, మనోహరమగు వర్ణనాక్రమము ఆంధ్రదేశీయులకు తెలియనివిగావు. ఈమహాగ్రంథమున భక్తిరసముపొంగి పొరలి పోవుచున్నది. దీనిఘనతను మేము వ్రాయుటకన్నచూచి మీరే తెలిసికొనఁ బ్రార్థించెద. కొన్నిటికూర్పు కొలఁది ప్రతులుమాత్రమే ముద్రింపఁబడుచున్నవి.

వెల ప్రతి 1-కి రూ॥. 3—8—0.

ఇవి మొదలగు సంస్కృతాంధ్రగ్రంథములు అనేకములు మాయొద్ద దొరకును. కావలసినవారికి క్యాటలాగును పంపుదుము.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
192, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.